క్లుప్తంగా

సబ్ కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్



బోధన్: కొత్తగా వచ్చిన యువ ఐఏఎస్ అధికారి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోను సోమవారం మున్సిపల్ చైర్మన్ తూము పద్మాశరత్ రెడ్డి, పలువురు కౌన్సిలరుల మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కౌన్సిలర్ శరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బోధన్: సాలూర మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో ఇటీవల పోతుంగటి ఈరయ్య ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ ప్రమాదవశాత్తూ పేలిపోయి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. మంటలార్పేందుకు ప్రయత్నించి ఇదే కాలనీకి చెందిన సురేష్ అనే యువకుడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానిక సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. ఏఎంసీ డైరెక్టర్ సంగెపు భూమయ్య, సొసైటీ వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి, డైరెక్టర్లు గంటె హోట్లప్ప, కర్నాటి రామక్రిష్ణ, బచ్చు సాయిలు, మేత్రి లింబయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు..



ఆర్మూర్‌టౌన్: అబుదాబికి చెందిన వనిత సంఘం సభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్ కింద తెలంగాణ ప్రభుత్వానికి రూ.25 వేలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.25 వేలు చొప్పున సహాయం అందజేశారు. ఈ మేరకు ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజాగౌడ్‌కు సంఘం సభ్యురాలు వనిత డీడీలను అందజేశారు. నగదు సాయం చేసిన వనిత సభ్యులు మహిత, నిరుపమ, నయన, అర్చన, రాధిక, సుజన, యామినీలను ఆర్డీవో అభినందించారు. లయన్స్ క్లబ్ ఆర్మూర్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



బోధన్‌రూరల్: అమ్దాపూర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో 6వ ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర కన్వీనర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈనెల 27న సికింద్రాబాద్‌లో హరిహర కళాభవన్‌లో ఉద్యమకారుల ఆత్మీయ సన్మానం విజయవంతం చేయాలన్నారు. ఉద్యమకారులకు గుర్తించటానికి ఒక కమిటీ వేసి, గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, న్యూడెమాక్రసీ నాయకులు దేవారం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాధువుల దివ్య అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పో టీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజన్న తెలిపా రు. ఆర్మూర్‌లోని విజయ్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో దివ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 15,16,17 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. సోమవారం దివ్యను ఉపాధ్యాయులు అభినందించారు.

కూలిన పాత ఇల్లు

రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ రామమందిర సమీపంలో ఉన్న ఇక్బాల్‌కు చెందిన పాత ఇల్లు కుప్ప కూలింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు బాగా దెబ్బతిన్నది. దీంతో ఇక్బాల్ వేరే ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం ఇల్లు అకస్మాత్తుగా కూలిందని, అందులో ఎవరు లేనందున ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

చిరస్మరణీయుడు కాళోజీ

ప్రముఖ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడని పలువురు ప్రముఖులు వ్యాఖ్యానించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ చిరస్మరణీయుడని, సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. తెలంగాణ చరిత్రలో కాళోజీ చిరస్థాయిగా నిలిచి ఉంటారని అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కమ్మర్‌పల్లిలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సెర్ప్ సిబ్బంది



బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతి నిర్వహిస్తున్న అధ్యాపకులు



పడగల్ హైస్కూల్లో..



మాక్లూర్ మండలం చిన్నాపూర్ హైస్కూల్‌లో..



ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ..



కాళోజీ జయంతి సందర్భంగా ఊట్‌పల్లిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు రమేష్ రెడ్డి



ఐలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



హాజరైన క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పూర్ణచందర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు శరీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలంటే ప్రతిరోజూ ఆటలాడాలన్నారు. అలాగే జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, మర్కంటి గంగామోహన్‌లు మాట్లాడుతూ.. జిల్లా ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన 25 మంది క్రీడాకారులను మూడు రోజులపాటు శిక్షణ శిబిరం నిర్వహించి, తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు సిరిసిల్ల జిల్లాలో జరిగే రాష్ట్ర జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ సాయన్న సాఫ్ట్‌బాల్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు



నవీపేటలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

బోధన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ నేత వడ్డీ మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆ పార్టీ నాయకులు రక్తదానం శిబిరం నిర్వహించారు. 20 మంది వరకు కార్యకర్తలు రక్తదానం చేశారు. పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వినోద్, నాయకులు సుధాకర్ చారి, శ్రీధర్, గోపికిషన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: వడ్డీ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా నవీపేటలోని గణేష్ మండపాలలో బీజేపీ కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చౌరస్తాలో కేక్ కట్ చేసి పంచారు. బీజేపీ నాయకులు ద్యాగసరిన్, గణేష్, భూషణ్, సాయన్న, చరణ్‌రెడ్డి, ప్రవీణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రైవేట్ స్కూల్స్, కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

బోధన్: కొత్తగా వచ్చిన సబ్ కలెక్టర్ వికాస్ మహతోను సోమవారం పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఆఫీసులో ప్రైవేట్ స్కూల్స్ అండ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ బోధన్ శాఖ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా పూల బోకే అందించి సన్మానించారు. అనంతరం కొత్తగా బదిలీపై వచ్చిన టౌన్ సీఐ వెంకట నారాయణను పోలీస్ స్టేషన్‌లో కలిసి సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్త్యాల హరికృష్ణ, మిద్దెల రాజు, ప్రతినిధులు కొడాలి కిషోర్, వై.శ్రీనివాస్‌రావు, చక్రవర్తి, జయప్రకాష్, సురేష్, రాధాక్రిష్ణ, చౌడారెడ్డి, గుర్రం సంతోష్ పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

బోధన్‌రూరల్: గ్రామాల్లో పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని భవానీపేట్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ.8,100లు నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సభను జయప్రదం చేయాలి



రుద్రూర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరులను స్మరిస్తూ ఈ నెల 11న కోటగిరి మండల కేంద్రంలో నిర్వహించే వారోత్సవాల సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అంబటి విఠల్ గౌడ్ పిలుపునిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, మాతృభూమి విముక్తి కోసం జరిగిన పోరాటంలో అనేక మంది సీపీఐ కార్యకర్తలు ప్రాణ త్యాగం చేశారని, వారి పోరాట ఫలితంగానే 10 లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అనేక గ్రామాల్లో వెట్టి చాకిరీ విముక్తి కలిగిందన్నారు. నాయకులు నల్ల గంగాధర్ ఉన్నారు.

2కే రన్‌లో బంగారు పతకం



ఆర్మూర్: జిల్లా ఎయిడ్స్ నివారణ, కంట్రోల్ యూనిట్, గిరిరాజ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌లో గురుకుల విద్యార్థిని రోజా బంగారు పతకం సాధించింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల(దాస్‌నగర్)లో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న రోజాకు సోమవారం కళాశాలలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవ వేడుకల్లో బంగారు పతకాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ధాత్రిక వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఊర చెరువు తూముకు గండి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో ఊర చెరువు తూముకు గండి ఏర్పడింది. ఆదివారం అర్ధరాత్రి తూముకు గండి పడటంతో చెరువు నుంచి నీరు వరదలాగా ప్రవహిస్తోంది. ఉదయం గమనించిన గ్రామస్తులు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇరిగేషన్ ఈఈ రమణ, ఏఈ సునీల్ గ్రామానికి చేరుకుని వీడీసీ వారి సహాయంతో చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో తూము వద్ద మొరం వేసి నీటిని నియంత్రించే ప్రయత్నం చేశారు. అయినా లీకేజీ కొనసాగడంతో ఇసుక బస్తాలను అడ్డుగా వేసి ప్రవాహన్ని నిలువరించారు. సహాయక చర్యల్లో వీడీసీ సభ్యులు రాజు, సాయన్న కూడా పాల్గొన్నారు.

సొసైటీ సర్వ సభ్య సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోని సొసైటీలో సోమవారం చైర్మన్ తంబూర్ శ్రీనివాస్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి మల్లేష్ ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. సమావేశంలో క్లస్టర్ ఆఫీసర్ బాబురావు, వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలి

బాల్కొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో మెండోరా మండలం దూదిగాం గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని స్థానిక అంబేడ్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీవో భరత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గ్రామంలో ఎస్సీ కుటుంబాలు 150 వరకు ఉంటాయన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కేటాయించలేదని గుర్తు చేశారు.

బాలుడి అదృశ్యం



నవీపేట: నవీపేట గ్రామానికి చెందిన షేక్ హయజ్(16) అనే బాలుడు శనివారం ఉదయం అదృశ్యమయ్యాడు. హయజ్ ఆచూకీ లభించకపోవడంతో బాలుడి తండ్రి ఫారూఖ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడు ఇంట్లో నుంచి వెళ్లినప్పుడు నల్లని ప్యాంటు, తెలుపు రంగు చొక్కా, తలపై టోపీ ధరించి ఉన్నాడని, సుమారు 4.5 అడుగుల ఎత్తుంటాడని పోలీసులకు వివరించారు. ఎవరికైనా కనిపిస్తే 8712659845 సమాచారం ఇవ్వాలని ఎస్సై వినయ్ తెలిపారు.

తెలంగాణ విలీనం- వాస్తవాలు పుస్తకావిష్కరణ



ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా నాయకులు

బోధన్: సీపీఎం ఆధ్వర్యంలో ముద్రించిన తెలంగాణ విలీనం- వాస్తవాలు పుస్తకాన్ని సోమవారం పట్టణ కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డివిజన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం ఘటనను బీజేపీ వక్రీకరిస్తోందని ఆరోపించారు. కమ్యూనిస్టుల వీరోచిత పోరాటాన్ని తక్కువ చేసి చూపించేందుకు దుష్ప్రచారం జరుగుతోందన్నారు. తెలంగాణ విలీన వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 15 ,16,17 తేదిల్లో బోధన్, నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నాయకులు శంకర్‌గౌడ్, యేశాల గంగాధర్, వెంకటేష్, నన్నేసాబ్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ప్రతినిధులు

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో ఈ నెల 17న నిర్వహించబోయే గణేష్ శోభాయాత్ర, నిమజ్జన ఉత్సవాలకు రావాలని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిని సార్వజనిక్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నివాసంలో సార్వజనిక్ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కందుకాల శ్రీకాంత్ గౌడ్, ప్రధానకార్యదర్శి తాడు మహేష్, కోశాధికారి గంగుల దేవిదాస్, ప్రతినిధులు పవన్, కిరణ్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.20 వేల నష్ట పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నేత వెంకటేష్

బోధన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఆయన స్థానిక సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. పంట నష్ట పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని కోరారు. రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం జమ చేయాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు సాయిబాబా, రాజయ్య, మేకల సంతోష్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి



నిర్వాహకులకు వినతిపత్రం అందజేస్తున్న హిందూ పరిరక్షణ సమితి సభ్యులు

కమ్మర్‌పల్లి: గణేశ్ ఉత్సవాలు హిందూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని హిందూ పరిరక్షణ సమితి సూచించింది. సోమవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని గణేష్ నవరాత్రోత్సవ మండపాల నిర్వాహకుల వద్దకు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి హిందూ పరిరక్షణ సమితి సభ్యులు వెళ్లారు. ఉత్సవాల నియమ నిబంధనలను తెలియజేశారు. నిమజ్జనం రోజునే రాత్రి 12 గంటల లోపు నిమజ్జనం చేయాలని సూచించారు. ఈమేరకు వినతి పత్రాలను అందజేశారు. రాజశేఖర్, రమణయ్య, గంగాధర్, రామస్వామి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ అధికారికి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న మహిళా రైతు

వేల్పూర్: పడగల్ సొసైటీలో అక్రమాలపై విచారణ అధికారిగా నియమితులైన సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళికి సొసైటి పరిధిలోని గ్రామాల రైతులు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన పడగల్ సొసైటీకి వచ్చి విచారణకు అవసరమైన మరిన్ని రికార్డుల గురించి ఆరా తీశారు. ఆయన వచ్చిన విషయం తెలుసుకొని అంక్సాపూర్, కుకునూర్ గ్రామాలకు చెందిన రైతులు సొసైటీ ద్వారా తమకు అన్యాయం జరిగిందని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీర్ఘకాలిక రుణాలు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తాం.. భూములు వేలం వేస్తామని అధికారులు బెదిరిస్తుంటే గత్యంతరం లేక చెల్లిస్తున్నామని విచారణ అధికారికి విన్నవించారు. లోతుగా విచారించి న్యాయం చేయాలని కోరారు.

సమాచారం..

■ **నేటి నుంచి ఉమ్మడి మండల స్థాయి క్రీడలు**

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నుంచి ఉమ్మడి బాల్కొండ మండలాల క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాజేశ్వర్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు సకాలంలో హాజరై క్రీడలను విజయవంతం చేయాలని కోరారు.

■ **ఆర్మూర్‌లో బీసీ సదస్సు**

ఆర్మూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర కుల గణన చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో బీసీ న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంగళవారం పెర్కిట్‌లోని ఎమ్మార్ గార్డెన్స్‌లో బీసీల సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ పార్లమెంట్ ఇంచార్జి దేగాం యాదగౌడ్, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, న్యాయవాదులు చిల్క కిష్టయ్య, ప్రవీణ్, అజిత్, రాములు, రాకేశ్, మోహన్, గణేశ్, శ్రావణ్, వంశీ పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)
- స్క్రీన్-1 – నరిపోదా శనివారం (తెలుగు) - 10.25, 2.00, 5.35, 35-చిన్న కథ కాదు - 9.10
- స్క్రీన్-2 – ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు)- 11.00, 2.45, 6.30, 10.15
- స్క్రీన్-3 – 35-చిన్న కథ కాదు - 12.00, 3.05, 6.10, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ - 9.15
- స్క్రీన్-4 – నరిపోదా శనివారం- 11.30, 3.05, 6.40, 10.15

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతాపషియన్) నిజామాబాద్
- స్క్రీన్-1 35 చిన్నకథ(తెలుగు)-10.10 నరిపోదా శనివారం(తెలుగు)- 12.55, 7.15,10.25
- స్క్రీన్-2 గ్రేటెస్ట్(తెలుగు)-10.00,7.10,10.35 35: చిన్నకథ(తెలుగు)-1.30,4.20
- స్క్రీన్-3 గ్రేటెస్ట్(తెలుగు)-12.40 4.10 35 చిన్నకథ(తెలుగు)- 7.40 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 35-చిన్నకథ(తెలుగు)-12.30 సరిపోతు శనివారం -3.35,10.30 స్త్రీ-2(హిందీ)-7.10
- స్క్రీన్-2 ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్(తెలుగు)- 10.30,2.15,6.00,9.45
- స్క్రీన్-3 ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్(తెలుగు)-12.15 35-చిన్నకథ -4.00,7.05,10.10
- స్క్రీన్ -4 స్త్రీ-2(హిందీ)-1.10 ,4.25,10.15 స్పీడ్-220(తెలుగు)-7.40

- లలితామహాల్ నరిపోదా శనివారం(తెలుగు)
- దేవి ది గోట్(తెలుగు)
- నటరాజ్ గబ్బర్‌సింగ్(తెలుగు)
- విజయ్ చిన్నకథ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,200	వెండి (కిలో)	86,500
22 క్యారెట్స్	68,450		

- నిజామాబాద్ బిజినెస్